క్లుప్తంగా

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏవో ప్రసాద్

భీమవరం అర్బన్: వరి నాట్లు పూర్తయిన రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి యర్రంశెట్టి ప్రసాద్ రైతులకు సూచించారు. భీమవరం మండలంలోని యనమదుర్రు గ్రామంలో బుధవారం ఈ-క్రాప్ నమోదును ఏవో ప్రసాద్ పరిశీలించారు. ఈ-క్రాప్ నమోదులో రైతులు తమ పంట రకం, రైతు వివరాలతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఇలా చేయడం ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు పంట నష్ట పరిహారం, మద్దతు ధరకే ధాన్యం విక్రయించుకోవడానికి, ఇతర ప్రభుత్వ పథకాలు లబ్ధి పొందడానికి ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు. మండల వ్యవసాయాధికారి యర్రంశెట్టి ప్రసాద్, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు

ఎక్సైజ్ అధికారుల దాడులు

కాళ్ల: ప్రభుత్వ అనుమతులు లేకుండా అనధికారంగా మద్యం అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆకివీడు ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. కాళ్ల మండలం కలవపూడి శివారు మోడి గ్రామంలో ప్రొబిషనరీ, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించారు. అనధికారంగా మద్యం అమ్ముతున్న గుడాల కాంతమ్మను అదుపులోకి తీసుకొని ఆమె వద్ద 6 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆకివీడు ఎక్సైజ్ ఎస్సై వి.కరుణ ప్రియ తెలిపారు.

ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ ప్రసాద్

భీమవరం (ప్రకాశంచౌక్): విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలని ట్రాఫిక్ సీఐ వి.శ్రీనివాసరావు సూచించారు. తిరుమల విద్యా సంస్థల్లో బుధవారం ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెహికల్ ఇన్‌స్పెక్టర్ కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు వాహనాలు నడిపేందుకు విధిగా లైసెన్సులు పొందాలన్నారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ, అతివేగంగా వాహనాలను నడపకూడదన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట తప్పనిసరిగా ధరించాలన్నారు. విద్యా సంస్థల వాహన డ్రైవర్లకు బ్రీత్ అనలైజర్ టెస్టు చేశాక వాహనం నడపాలని సూచించారు. ఆర్టీఓ అధికారులు ఏఎస్‌పీ తేజ, కళాశాల డైరెక్టర్ పి.వర్మ, ఎస్.సాయిరాజు, శ్రీరంగ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.


వేతన సవరణ అమలు చేయాలి



మాట్లాడుతున్న ప్యాప్టో నేతలు

పాలకోడేరు: 12వ వేతన సవరణ అమలుకు కమిషన్ నియమించాలని, మధ్యంతర భృతి వెంటనే మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం, పాత బకాయిలు వెంటనే విడుదల చేయాలని పశ్చిమగోదావరి జిల్లా ఫ్యాప్టో చైర్మన్ పీఎస్ విజయరామరాజు, సెక్రటరీ జనరల్ జి.ప్రకాశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీనికి సంబంధించి బుధవారం పాలకోడేరులో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 2023 జూలై నుంచి ఉద్యోగులకు వేతన సవరణ చేయాలని, రెండేళ్లు గడిచినా ఇంత వరకు దాని గురించి ప్రభుత్వం ఆలోచన చేయడం లేదని, అందు వలన తక్షణమే 12వ వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేయవలసిందిగా డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేసి, 2003 ముందు నియామకం పొందిన వారికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో నంబర్ 57ను అమలు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కో చైర్మన్ సాయి వర్మ, డిప్యూటీ సెక్రటరీ జనరల్ వెంకటేశ్వరరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో ఉమామూలేశ్వరస్వామి



వీరవాసరం: రాయకుదురులో వేంచేసియున్న శ్రీ ఉమా మూలేశ్వరస్వామి దేవస్థానంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా బుధవారం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి, లక్షపత్రి పూజ చేశారు. పార్వతీ దేవిని శాకంబరిగా అలంకరించారు. లక్షపత్రి పూజా కార్యక్రమాలు సుదురుపాటి కుటుంబ సభ్యులచే, శాకంబరి అలంకారం లలితా కుటుంబ సభ్యులు, దేవ స్థానం కమిటీ సభ్యులచే చేపట్టారు. ముందు గా అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.

దోమలు.. బాబోయ్ దోమలు

- జ్వరాల బారిన పడుతున్న జనం
- పారిశుద్ధ్య లోపమే కారణమంటూ విమర్శలు
- నిర్మూలన చర్యలు చేపట్టాలని కోరుతున్న ప్రజలు



దోమలు



అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలో దోమల బెడద తీవ్రంగా ఉంది. ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షానికి దోమలు విపరీతంగా పెరిగిపోయి దండ యాత్ర చేస్తున్నాయి. దోమల నివారణకు దండయాత్ర చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం వాటి నివారణకు ఏవిధమైన చర్యలూ చేపట్టడం లేదు. పట్టణాల్లోనూ, పల్లెల్లో దోమల బెడదతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. పలు వార్డుల్లో జ్వరాలతో బాధపడుతున్నారు. రోడ్లపై సాయంత్రం ఐదు గంటలకే ప్రజలు నడవలేని, ప్రయాణించలేని దుస్థితి ఏర్పడింది. పట్టపగలే దోమలు విపరీతంగా ఇళ్లల్లో కుడుతున్నాయని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. నగర పంచాయతీలోని పలు వార్డుల్లో డ్రెయినేజీలను శుభ్రం చేయడం లేదు. దీంతో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. దోమల నివారణకు ఏ విధమైన చర్యలూ తీసుకోవడం లేదు. గతంలో దోమల నిర్మూలనకు మందు పిచికారీ చేసేవారు. ఫాగింగ్ మిషన్లు ఉన్నప్పటికీ వాటిని అటకెక్కించారనే ఆరోపణలు కౌన్సిలర్ల ద్వారానే వినిపిస్తున్నాయి. డ్రెయినేజీల్లో ఆయిల్ బాల్స్ వేసి దోమల లార్వాను చంపే చర్యలు చేపట్టినప్పటికీ నేడు ఆ పరిస్థితి లేదు. ప్రధాన డ్రెయిన్లు, వార్డుల్లోని డ్రెయిన్లలో దోమలు అధికంగా పుట్టుకొస్తున్నాయి. నీటి నిల్వలను తొలగించే ప్రయత్నాలు చేయడం లేదు.

జ్వరాలతో ప్రజలు

పలు వార్డుల్లో జ్వరాలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. సీజనల్ జ్వరాలు వస్తున్నప్పటికీ ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడం లేదు. ఏఎన్ఎంలు ఇంటింటికీ తిరిగి జ్వరాల సర్వే చేస్తున్నా, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు జ్వర పీడితులు క్యూ కడుతున్నారు. ఇటీవల జ్వరంతో చాలా మంది బాధపడుతూ వైద్యం పొందుతున్నారు. జ్వరం వస్తే నీరసించిపోయి, తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముందు జాగ్రత్తలు లేవు

నగర పంచాయతీ, పల్లెల్లో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడం లేదు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికున్ గున్యా, మెదడు వాపు, ఎన్‌సెఫలైటీస్(పిల్లల్లో) వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందంటున్నారు. పంచాయతీలు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్లు ఏ విధమైన చర్యలు చేపట్టడం లేదు. ఎక్కడిక్కడ నీటి నిల్వలు, డ్రెయినేజీల్లో క్లియరెన్స్, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాల్సి ఉంది. ఇటువంటి చర్యలు తీసుకుంటే సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉండదు. ఎప్పటికప్పుడు మలేరియా డిపార్ట్‌మెంట్ నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకుంటూ, పంచాయతీలకు, నగర పంచాయతీకి సూచనలు, సలహాలు ఇవ్వాల్సి ఉంది.

అక్కసుతోనే దొంగ కేసులు



బడుగు బాలాజీ

ఉండి: చిత్తూరు జిల్లాలో చంద్రబాబు ఎన్ని జిమ్మిక్కులు చేసినా పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఓడించలేకపోతున్నామనే అక్కసుతోనే దొంగ కేసులతో పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేయాలని చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని వైఎస్సార్ సీపీ ఆర్టీఐ రాష్ట్ర కార్యదర్శి బడుగు బాలాజీ ఆరోపించారు. రాజకీయ కక్షతో సిట్ అధికారులను అడ్డం పెట్టుకుని కట్టుకథతో మద్యం కేసుని సృష్టించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పనిచేసిన అధికారులను జైలులో పెట్టించి ఇప్పుడు మిథున్‌రెడ్డిని జైలులో పెట్టించడం చంద్రబాబు కుటిల రాజకీయానికి నిదర్శనమని తెలిపారు. 2014-19 టీడీపీ మద్యం పాలసీ రూపకల్పన చేసి మద్యం కుంభకోణంద్వారా వేల కోట్లరూపాయలు దోపిడీ చేసిన వ్యక్తి చంద్రబాబు నాయుడని కోర్టులో బెయిల్ తెచ్చుకున్న తరువాత దొంగే దొంగ అని అరుస్తున్నట్లు అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఇతరులమీద నెట్టి తాను తప్పించుకోవాలని చూస్తున్నారని స్పష్టంచేశారు. మద్యం తయారీలో కొత్త బ్రాండ్లకు 14 డిస్టిలరీలకు పర్మిషన్ ఇచ్చింది చంద్రబాబేనని తెలియజేశారు. చంద్రబాబు పెట్టే అక్రమ కేసులకు భవిష్యత్తులో లోకేష్ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

ఏఆర్‌టీ సెంటర్ తనిఖీ



ఏఆర్‌టీ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ జి గీతాబాయి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ జి.గీతాబాయి అధ్యక్షతన జిల్లా ఏఆర్‌టీ సరోగసీ తనిఖీల కమిటీ, శ్రీఎస్‌వీఆర్ మెటర్నిటీ ఆసుపత్రి ప్రారంభించనున్న ఏఆర్‌టీ మొదటి స్థాయి ఆసుపత్రి అనుమతులకు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ గీతాబాయి సంబంధిత కమిటీ ఏఆర్‌టీ క్లినిక్ నిర్వహణకు ఏర్పాటు చేసిన పలు విభాగాలు పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి గర్భిణులకు స్కానింగ్ నిర్వహణ, అనుమతులు తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ మాధురి, రేడియాలజిస్ట్ డాక్టర్ జీఎల్ఎస్ బాపిరాజు, పేథాలజిస్ట్ డాక్టర్ సాయికిరణ్మయి, రెడ్‌క్రాస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఎంఎస్‌వీఎస్ బద్రిరాజు, లీగల్ సెల్ మోనిటరింగ్ కన్సల్‌టెంట్ వి.సత్య రవి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ కాళీచరణ్

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం జేపీ రోడ్‌లోని శ్రీఆదిత్య డిగ్రీ కళాశాలలో సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారని కళాశాల డైరెక్టర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన భీమవరం టూ టౌన్ సీఐ జి.కాళీచరణ్ మాట్లాడుతూ చాలా మంది సైబర్ నేరగాళ్ల వలలో పడుతున్నారని, అవి మనం ఎదుర్కోవడం ద్వారా వాళ్ల ఆటలు కట్టిపెట్టొచ్చని అన్నారు. పలు మాధ్యమాల్లో వచ్చే వాటిని క్షుణ్ణంగా తెలుసుకొని దాని ద్వారా మనం చర్యలు కొనసాగించాలని తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ ఎ.అనురాధ జి.కాళీచరణ్‌ను సత్కరించారు. కార్యక్రమములో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎ.అనురాధ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మావుళ్లు, ప్రోగ్రాం ఆఫీసర్ బ్రహ్మం, కళాశాల ఏఓ జయ్‌కుమార్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ బిన్నిబాబు

వీరవాసరం: వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించి, అధిక దిగుబడులు సాధ్యమవుతాయని మండల వ్యవసాయ అధికారి బిన్నిబాబు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం బలుసులగొయ్యిపాలెం, పంజా వేమవరం గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ రుణం తీసుకోని రైతులు తక్షణమే ఎకరాకు 210 రూపాయలు చెల్లించి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో నమోదు కావాలని తెలిపారు. వరి సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ సతీష్, వీఏఏ దివ్య, తమ్మినేని నాగేశ్వరరావు, వీరవల్లి గణేష్, దానేశ్వరరావు, దంపన బోయిన రామాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

గణనీయంగా తగ్గుతున్న పాడి పరిశ్రమ



ఉండిలో ఆవులకు దాణా వేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఉండి: రాష్ట్రంలో రానురాను పాడిపరిశ్రమ గణనీయంగా తగ్గిపోతుందని ప్రభుత్వం దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ గాదిరాజు రంగరాజు, పెన్మత్స రంగప్రసాద్ అన్నారు. బుధవారం ఉండి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గోవులకు దాణా పెట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ గోమాతను పూజించడం ఎంత పుణ్యమో వాటికి దాణా పెట్టడం కూడా అంతే పుణ్యమన్నారు. కానీ గోవులను రోడ్డుపై వదిలిపెట్టడం చాలా విచారకరమన్నారు. రోడ్లపై వదిలే మూగజీవాల్లో అధికంగా గోమాతలు (ఆవులు) ఉండడం ఆలోచించాల్సిన విషయమన్నారు. పాడి రైతులు ఆవులు, పశువుల విషయంలో శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఆవులు, తదితర మూగ జీవాలకు దాత కాగిత మహంకాళి ఆధ్వర్యంలో దాణా అందజేశారు. కార్యక్రమంలో ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ సత్తి బ్రహ్మారెడ్డి, క్లబ్ మార్కెటింగ్ చైర్మన్ గాదిరాజు వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

సమాజ హితానికి దాతలు ముందుకు రావాలి



అన్నదాన వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ నాగరాణి

వీరవాసరం: దాతృత్వం కలిగిన దాతలు సమాజ హితానికి ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. వీరవాసరంలో కొనసాగుతున్న సేవా కార్యక్రమాన్ని తెలుసుకున్న కలెక్టర్ బుధవారం వీరవాసరం తులసి కన్వెన్షన్ హాల్‌లో అన్నదాత మల్ల తులసి రాంబాబు కొనసాగిస్తున్న అన్నదాన సేవలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పరిశీలించి, వారి కుటుంబాన్ని అభినందించారు. ఆహార పదార్థాలను జిల్లా కలెక్టర్ స్వయంగా రుచి చూశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంత మందికి ప్రతి రోజూ ఆహారాన్ని అందిస్తున్నారు. ఎన్ని గ్రామాలకు మీ క్యారేజీలు పంపుతారు. రోజుకి సుమారు ఎంత ఖర్చవుతుంది. ఎన్ని సంవత్సరాలుగా ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. వంటి పలు వివరాలను తులసి రాంబాబును అడిగి తెలుసుకున్నారు. రాంబాబు వివరిస్తూ గత ఐదు సంవత్సరాలుగా నిత్యం వీరవాసరం మండలంలోని 18 గ్రామాల్లో సుమారు 200 మంది వృద్ధులకు, అచేతన స్థితిలో ఉండి ఆహార పదార్థాలను తయారు చేసుకోలేని వారికి స్టీల్ క్యారేజీల ద్వారా ఆహార పదార్థాలను వారి ఇంటి వద్దనే అందజేస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీపీ వీరవల్లి దుర్గ భవాని, రాంబాబు, వరలక్ష్మి, గోవర్థిని, శ్రీరామమూర్తి, వీరవల్లి చంద్రశేఖర్, చికిలే మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లు పరిశుభ్రంగా ఉంచాలి

భీమవరం (ప్రకాశంచౌక్): అన్న క్యాంటీన్ ద్వారా అందించే ఆహార పదార్థాలు శుభ్రంగా, వేడిగా, రుచిగా ఉండాలని, ప్రభుత్వ లక్ష్యం మేరకు అన్న క్యాంటీన్లను చిత్తశుద్ధితో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాత బస్టాండ్, కొత్త బస్టాండ్‌ల వద్ద ఏర్పాటు చేసిన అన్న క్యాంటిన్లను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంలో మధ్యాహ్న భోజనం చేస్తున్న వారితో మాట్లాడారు. అనంతరం 40 మంది పేదలైన మహిళలకు చీరలు, మగవారికి దుప్పట్లు, లుంగీలు, టవల్స్, టూత్ పేస్టులు తదితర వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. మున్సిపల్ డీఈ రెహమాన్, ఎంహెచ్ఓ సోమశేఖర్, వార్డు సచివాలయం ఎమ్యూనిటీ కార్యదర్శి మోహన్‌రావు, మహిళా పోలీస్ పుష్ప రాణి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్ఎల్ఎం బృందం పర్యటన

ఆకివీడు: మండలంలో ఈ నెల 24వ తేదీ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకూ ఎస్ఎల్ఎం బృందం పర్యటిస్తుందని ఎంపీడీఓ మార్కండేయేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నోడల్ బృందానికి సంబంధిత మండల స్థాయి అధికారులు రికార్డులతో సహకరించాలన్నారు. ఎస్ఎల్ఎం బృందం ఉపాధి హామీ పనులు, జాబ్‌కార్డు ఉన్న 10 మందితో మాట్లాడటం, వారంలో ఒక రోజు పని వివరాలు అడుగుతారని తెలిపారు. ఆడిట్ రిపోర్టులు తనిఖీ చేస్తారన్నారు. 3 సంవత్సరాల్లో జరిగిన 15 పనులను పరిశీలిస్తారని చెప్పారు. మండలంలోని రాజులపేట, అప్పారావుపేట, దుంపగడప, సిద్ధాపురం, చినమిల్లిపాడు, కుప్పనపూడి గ్రామాలను సందర్శిస్తారని ఎంపీడీఓ తెలిపారు.

పీ4పై పునః సర్వే

పాలకోడేరు: మండలంలోని గొరగనమూడి గ్రామంలో పీ4పై బుధవారం మండల పరిషత్ కార్యాలయ అధికారుల బృందం పునః సర్వే నిర్వహించారు. అనంతరం గ్రామ సర్పంచ్ గొట్టుముక్కల శివాజీ రాజు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 15 నిరుపేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా ఎంపిక చేశారు. గ్యాస్ లేనివారిని, విద్యుత్ కనెక్షన్ లేని వారిని, ఉద్యోగం, పింఛన్, అద్దెలు వంటి ఆదాయం లేని కుటుంబాలను, తాగునీటి కొళాయి కనెక్షన్ లేని కుటుంబాలను, బ్యాంకు ఖాతా లేని కుటుంబాలను బంగారు కుటుంబాలుగా అర్హతగా నిర్ణయించారు. ఈ సర్వేలో పాల్గొన్న డ్వామా పీడీ కెసిహెచ్ అప్పారావు మాట్లాడుతూ బంగారు కుటుంబాలను ఎంపిక చేశామని కొంతమంది దత్తత తీసుకొని ఈ కుటుంబాలను అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తారని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నాగలింగాచారి, ఎంపీడీవో వి.రెడ్డియ్య, డ్రెయినేజీ ఏఈ దుర్గారావు, పంచాయతీ కార్యదర్శి సరళ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా పాలిథిన్ కవర్ల నిషేధం



మూలలంక బోదెలో పేరుకుపోయిన పాలిథిన్ వ్యర్థాలు

ఆకివీడు: పాలిథిన్ కవర్ల వాడకం స్థానిక నగర పంచాయతీలో యథేచ్ఛగా కొనసాగుతోంది. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ఇతర ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలు కొనసాగుతున్నాయి. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశించినా సంబంధిత అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడంతో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. పంట కాలువలు, మురుగు బోదెలు ప్లాస్టిక్ వస్తువులు, కవర్లతో నిండిపోతున్నాయి. నగర పంచాయతీ పరిధిలోని పలు చోట్ల రోడ్ల వెంబడి ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. శానిటరీ సిబ్బంది ఇంటింటికీ వచ్చి చెత్తను సేకరిస్తున్నా, ప్లాస్టిక్ కవర్లు రోడ్ల పైనే తచ్చాడుతున్నాయి. గాలికి డ్రెయిన్లు, కాలువల్లోకి ఖాళీ ప్రదేశాల్లోకి చేరుకుంటున్నాయి. కూరగాయలు, పండ్ల దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. కాఫీ హోటళ్లలోనూ, టీ స్టాళ్లలో ప్లాస్టిక్ గ్లాసుల వినియోగం కొనసాగుతోంది. నగర పంచాయతీ అధికారులు మొక్కుబడిగా ప్లాస్టిక్ వినియోగం అరికట్టే చర్యలు చేపట్టారని విమర్శలు వినపడుతున్నాయి. ఉన్నతాధికారులు హెచ్చరించినప్పుడు ప్రజల్లో అవగాహన కోసం ఫ్లెక్సీలతో ర్యాలీలు నిర్వహించినట్లుగా ఫొటోలు దిగుతున్నారని, ప్లాస్టిక్ వినియోగంపై చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

ఆకు కూరలతోనే పోషకాలు



తల్లులకు ఆకుకూరలు పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

పాలకోడేరు: పోషణ కార్యక్రమంలో భాగంగా మోగల్లు అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో కూరగాయలు పెంచి, గర్భిణులకు, బాలింతలకు పంపిణీ చేస్తున్నారు. ఆకు కూరలతోనే పోషకాహార లోపం సమస్య తీరుతుందని వారికి అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి మాట్లాడుతూ 2024-25 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించిందన్నారు. మొదటి పేజ్ పోషణ అంగన్‌వాడీ పథకంలో భాగంగా మండలంలో 12 అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపిక చేశారన్నారు. 2025-26 సంవత్సరానికి గాను రెండో పేజ్ కింద కొన్ని కేంద్రాలు ఎంపిక చేశారన్నారు. ఈ పథకంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పోషకాహారమైన ఆకుకూరలు, కూరగాయలతో వండించి పెడతారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త విమల, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

చెత్త సేకరణలో కలిసిపూడి ప్రథమం



కలిసిపూడిలో పారిశుద్ధ్య కార్మికులను సత్కరిస్తున్న సర్పంచ్,ఉపసర్పంచ్,ఎంపీటీసీ తదితరులు

ఉండి: గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చెత్త సేకరణలో కలిసిపూడి గ్రామ పంచాయతీ మండలంలో ప్రథమస్థానం, జిల్లాలో ఐదో స్థానంలో నిలిచిందని సర్పంచ్ కేశబోయిన జానకి శ్రీనివాస్, ఉప సర్పంచ్ మంతెన చంటిరాజు అన్నారు. బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఎంపీటీసీ దంగేటి రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు గ్రామ ప్రజల సహకారం, పారిశుద్ధ్య కార్మికుల నిబద్ధతతోనే ఇది సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో సచివాలయ అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రీమియం భారం.. బీమాకు రైతన్న దూరం

పంటల బీమాకు స్పందన కరువు



ట్రాక్టర్‌తో దుక్కు దున్నుతున్న రైతు (ఫైల్)

పెంటపాడు: భూమిలో విత్తు నాటినది మొదలుకొని పంట చేతికి వచ్చేవరకు అన్నదాతలకు అడుగడుగునా అవాంతరాలే. వాటిని అధిగమిస్తూ, కష్ట నష్టాలను భరిస్తూ ముందుకు సాగాలి. విత్తనం దొరక్క, ఎరువుల కొరత, భారం, సాగునీటి కష్టాలు, తుపానులు, ప్రకృతి వైపరీత్యాలు, యంత్రాల వినియోగం, పంట చేతికొచ్చే వరకు సొమ్ములు రావడం ఇలా ప్రతి పనీ రైతుకు ఆటంకమే. ఎన్నో సుడిగుండాలు దాటాలి. కష్టపడే రైతులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం వారి నిలువునా మోసం చేసింది. గత వైఎస్సార్ ప్రభుత్వంలో రైతులకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతలకు ఎంతో అండగా నిలిచారు. పంట సాగు నుంచి చేతికి సొమ్ము వచ్చేవరకు జగనన్న తోడున్నారు. వాటిలో పంటల బీమా గురించి ప్రధానంగా చెప్పాలి. రైతుల తరఫున జగనన్న ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించేది. కేవలం రైతుల నుంచి రూపాయి మాత్రమే ప్రీమియంగా వసూలు చేసేవారు. దీంతో ఆ ఐదేళ్లు రైతులకు పూర్తి భరోసా లభించింది. కానీ నేటి కూటమి ప్రభుత్వం బీమా ప్రీమియం భారాన్ని రైతులపై మోపింది. కొంతమంది మాత్రమే బీమా కట్టారు.

అన్నదాతల ఆవేదన

ఎన్నికల సమయంలో కూటమి నాయకులు అనేక హామీలు గుప్పించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామని వాగ్దానం చేశఋూరు. తీరా అధికారంలోకి వచ్చినా ఆ ఊసే మరిచారు. అలాగే పంటల బీమా పథకాన్ని రైతులే కట్టుకోవాలని ఉత్తర్వులు జారీ చేశఋూరు. జగనన్న ప్రభుత్వంలో ఉచితంగా పంటల బీమా పొందిన రైతులందరూ చంద్రబాబు తీరుతో గగ్గోలు పెడుతున్నారు. అసలే పెట్టుబడి సాయం లేక ఇబ్బంది పడుతుంటే ఇక బీమా ప్రీమియం ఎలా కట్టాలి? అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్పందన కరువు

పెంటపాడు మండలంలో 21 వేల ఎకరాలకు గాను కేవలం కొద్ది మంది రైతులు మాత్రమే ప్రీమియం కట్టారు. గత టీడీపీ ప్రభుత్వ కాలంలో రైతులు పంటల బీమా చెల్లించినా నష్టం జరిగిన ఏనాడూ పరిహారం దక్కిన పరిస్థితులు లేవు. ఇక ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితే ఉంటుందనే రైతులు భావిస్తున్నారు. దీంతో ఎక్కువ మంది రైతులు గడువు పొడిగించి నప్పటికీ వారి నుండి స్పందన కరువైంది.

భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ సేవలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని భవిత కేంద్రంలో బుధవారం డాక్టర్ అల్లు శ్రీకృష్ణ మహేష్ బాధితులకు ఫిజియోథెరపీ సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులోనే సమస్యను గుర్తించి ప్రతి రోజూ క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ అందిస్తే దివ్యాంగ పిల్లలు వారి సమస్యలను అధిగమించగలుగుతారని చెప్పారు. మేనరిక వివాహాలను ప్రోత్సహించవద్దని, గర్భిణులు అనుభవజ్ఞులైన వైద్యుల సూచనలు, సలహాలు తప్పక పాటించాలని తెలిపారు.